



# ఆపద్బాంధవుడు

వాణిశ్రీ

ఎండలో పడి వచ్చాడేమో కృష్ణమూర్తి ముఖం వాడిపోయి వుంది. ముడతలు పడి కళ తప్పిన భర్తను చూస్తుంటే శాంతమ్మకు ఆవేదన కలిగింది.

"కాళ్ళు కడుక్కోండి" అంటూ చెంబుతో నీళ్ళు అందించింది.

కృష్ణమూర్తి లోపలకు వచ్చి పడక్కుర్చీలో కూర్చున్నాడు. కొంచెంసేపు కళ్ళుమూసుకుని సేదతీరాడు. కాసేపటికి కాఫీ కప్పుతో వచ్చిన శాంతమ్మ "కాఫీ తాగండి" అన్నది.

కృష్ణమూర్తి కళ్ళు తెరిచి చూశాడు.

"లక్ష రూపాయలు కట్టాలట. అది తిరిగి ఇవ్వరటగూడా!" అంటూ కాఫీ కప్పు అందుకున్నాడు.

"లక్ష రూపాయలే?" అని ఆశ్చర్యం వ్యక్తం చేసింది శాంతమ్మ.

తలవూపాడు కృష్ణమూర్తి.

"అంత డబ్బు ఎక్కడ్నుంచి తెస్తాం?" అన్నది నిరాశపడుతూ.

"మూర్తిగారూ!" అంటూ లోపలకు వచ్చాడు నాగభూషణం.

ఆయన ఆ వీధిలోనే వుంటాడు. నలుగురు కొడుకులు. వ్యాపారంలో స్థిరపడ్డాడు.. నాగభూషణం వూరంతా తిరుగుతూ 'ఎవరైనా ఇల్లు అమ్ముతున్నారేమో?' అని ఎంక్వయిరీ చేసుకుంటూ తిరుగుతాడు. చాలా ఇబ్బందుల్లో వున్నవాళ్ళవి చౌకగా కొంటాడు. అద్దెలకిస్తుంటాడు.

"నాకెందుకు వ్యాపారం? పిల్లలు చేసుకుంటున్నారుగా" అంటూనే వ్యాపారం చేస్తుంటాడు. నెలానెలా వచ్చే అద్దె డబ్బుతో చిట్‌ఫండ్ కంపెనీలో చిట్స్ వేస్తుంటాడు. కృష్ణమూర్తి అద్దెకున్న ఇల్లు ఆయనదే.

"రండి..రండి!" అన్నాడు కృష్ణమూర్తి.

శాంతమ్మ కాఫీ తెచ్చి ఇచ్చింది.

"ఇప్పుడెందుకమ్మా! ఇప్పటికే రెండుసార్లు తాగాను" అంటూనే కప్పు అందుకున్నాడు.

"ఏమిటి మీరు ఇల్లు ఖాళీ చేయాలనుకుంటున్నారని అంతా చెప్పుకుంటున్నారు?" అడిగాడు నాగభూషణం.

"ఔనండీ! వృద్ధాశ్రమంలో చేరాలనుకుంటున్నాం. రోజు రోజుకు ఈవిడ నీరసపడిపోతోంది. ఇంటిపని, వంటపని చెయ్యలేకపోతోంది. సుగర్ కదా! ఇంటికి అద్దె, సరుకులు తెచ్చుకోవడం, కూరగాయల కోసం తిరగడం వంటివన్నీ తప్పుతాయి ఆశ్రమంలో చేరితే" చెప్పాడు కృష్ణమూర్తి.

"నిజమే! మీ ఆలోచన భేషుగ్గా వుంది" మెచ్చుకున్నాడు నాగభూషణం.

కృష్ణమూర్తి ఇల్లు ఖాళీ చేస్తే అద్దె పెంచి వేరేవాళ్ళకి ఇవ్వొచ్చనే ఆలోచన నాగభూషణానిది.

"ఒక ఆశ్రమం మాకు బాగా నచ్చింది. మా దంపతులకు ప్రత్యేకంగా ఒక గది ఇస్తారు. ఉదయం ఆరింటికి టీ, ఎనిమిదికి టిఫిన్, మధ్యాహ్నం పన్నెండున్నరకి భోజనం, సాయంకాలం నాలుగుకి స్నాక్స్, టీ, రాత్రి భోజనం, ఆ తర్వాత పాలు ఇస్తారట. అక్కడ వుంటున్నవాళ్ళు చాలా సంతోషంగా వుంటున్నామని చెప్పారు."

"ఇద్దరికీ ఎంతేమిటి?" అడిగాడు నాగభూషణం.

"నాలుగువేల రెండు వందలు"

"డెడ్ చీప్. మీరు చెప్పేది నిజమైతే, నేను, నా భార్య కూడా చేరిపోతాం. హాయిగా వుంటుంది" అని నవ్వాడు నాగభూషణం.

"ఆశ్రమంలో వుండే ఖర్మ మీకేమిటండీ? నలుగురు కొడుకులు, కోడళ్ళు, మనుమల సంతానం. ఐశ్వర్యంలో తులతూగుతున్నారు" అన్నాడు కృష్ణమూర్తి.

"మరి ఎప్పుడు వెళ్తున్నారేమిటి?"

"మాకు నచ్చిన ఆశ్రమంలో లక్ష రూపాయలు డొనేషన్ అడుగుతున్నారు. అదే చూస్తున్నాం" అన్నాడు కృష్ణమూర్తి.

కాసేపు మాట్లాడి వెళ్ళిపోయాడు నాగభూషణం.

"మాస్టారూ!...మాస్టారూ" వీధిలో నుంచి ఎవరో కేక పెట్టారు.

శాంతమ్మ వీధిలోకి వెళ్ళి చూసింది. ఎవరో మధ్యవయస్కుడు కనిపించాడు. ఎత్తుగా చామనఛాయలో వున్నాడు. ఆమెకు అతన్ని ఎప్పుడూ చూసిన గుర్తురాలేదు.

"ఎవరండీ?" అని అడిగింది.

"కృష్ణమూర్తి మాస్టారు వున్నారాండి?" అడిగాడు అతను.

"ఉన్నారు. లోపలకు రండి" అన్నది.

అతను లోపలకు వస్తూనే "నమస్కారం మాస్టారూ" అన్నాడు.

"నమస్కారం మీరు?..." అన్నాడు గుర్తుపట్టడానికి ప్రయత్నిస్తూ.

అప్పుడప్పుడూ అతని దగ్గర చదువుకున్న పూర్వ విద్యార్థులు అభిమానంతో కలవడానికి వస్తుంటారు. "మీరు అప్పుడు రాసిన కథలు ఇప్పటికీ గుర్తున్నాయండీ. ఇప్పుడు మీరేం రాయడం లేదా? మీ కథ వుంటుందేమోనని పత్రికలు చూస్తుంటాం" అని చెప్తుంటారు. అలా వచ్చినవారితో సాహిత్య చర్చలు చేస్తూ ఆనందిస్తుంటాడు కృష్ణమూర్తి.

"ఇతను కూడా తన పూర్వవిద్యార్థి ఏమో?" అనుకున్నాడు.

"నా పేరు వెంకటరమణండీ. విజయవాడ నుంచి వచ్చాను"

"అలాగా! కూర్చోండి" అంటూ కుర్చీ చూపించాడు.

రమణ కూర్చుని "మాది చింతామణి పబ్లికేషన్స్. మా నాన్నగారు ఏలూరు రోడ్డులో పుస్తకాల షాపు నడిపేవారు" అన్నాడు.

'ఐతే ఇతను నా స్టూడెంట్ కాదన్నమాట. పబ్లికేషన్స్ అంటున్నాడు. నాతో ఏం పని? కొంపదీసి నా కథల సంపుటి పబ్లిష్ చేస్తానంటాడా?' అనుకున్నాడు.


'కాని ఈ రోజుల్లో కథల పుస్తకాలు ఎవరు వేస్తారు? నా పిచ్చిగాని'

కృష్ణమూర్తికి నవ్వొచ్చింది.

"మీ కథల సంపుటులు పబ్లిష్ చేద్దామనుకుంటున్నానండీ.." అన్నాడు రమణ.

"నా కథలా?" ఆశ్చర్యంతో అన్నాడు.





వెంకటరమణ తలవూపాడు.

“నేను కథలు రాయడం మానేసి దాదాపు ఇరవై ఏళ్ళయింది. ఉన్నవన్నీ పాత కథలు”

అతను అర్థోక్తిలో అందుకుని “నాకు కావాల్సింది మీ పాత కథలే. వాటిల్లో అప్పటితరం మనస్తత్వాలు, ఘర్షణలు, సమాజంలో చొరబడుతున్న మార్పులు అన్నీ వుంటాయి గదా మాస్టారూ! నేను టీనేజీలో వున్నప్పుడు మీ కథలు అభిమానంగా చదివేవాడిని. మీ కథల సంపుటి వెయ్యమని మా నాన్నగారితో అనేవాడిని. కథలు ఎవరూ కొనర్రా! నవలలైతే వెయ్యొచ్చు అనేవారు. ఇప్పుడు ఆయన లేరు” అన్నాడు.

“ఇప్పుడు మాత్రం కథల పుస్తకాలు కొంటున్నారా?” అడిగాడు కృష్ణమూర్తి.

“నవలలు రావడం లేదు మాస్టారూ! అభిరుచి గలవాళ్ళు కథల పుస్తకాలు కొంటున్నారు” అన్నాడు రమణ.

అతను కృష్ణమూర్తితో మాట్లాడుతూ వుండగా శాంతమ్మ వచ్చి కాఫీ కప్పు అందించింది.

“ఇప్పుడెందుకమ్మా?” మొహమాటంగా అన్నాడు రమణ.

“ఇంటికెవరొచ్చినా ఈవిడ తన కాఫీ రుచి చూపించిగాని వదలదు. ఫరవాలేదు తీసుకో రమణా!” అన్నాడు కృష్ణమూర్తి నవ్వుతూ.

“మీ కథలు పడిన పత్రికలుంటే ఇవ్వండి. జెరాక్స్ కాపీలు తీసుకుంటాను” అన్నాడు రమణ.

“నా కథలు పడిన పత్రికలన్నీ లేవు. కొన్ని పోయాయి. అప్పట్లో ఎవరెవరో కథ చదువుతామని తీసుకెళ్ళేవాళ్ళు. చేతులు మారి ఇక తిరిగి వచ్చేది కాదు”

“పోనీ వున్నవే ఇవ్వండి. పత్రికలలో పడిన తేదీలు, వివరాలు ఇస్తే పత్రికల ఆఫీసులకెళ్ళి కలెక్ట్ చేసుకుంటాను”

రమణ మాటలకు నవ్వాడు కృష్ణమూర్తి.

“పత్రికలు మూతపడిన తర్వాత ఇక ఆఫీసులెక్కడ వుంటాయి? ఏ లైబ్రరీలోనో దొరకొచ్చు” అన్నాడు.

కృష్ణమూర్తి ఇంట్లోకి వెళ్ళి ట్రంక్ పెట్టెలో దాచుకున్న పత్రికలు కొన్ని తెచ్చి రమణకు ఇచ్చాడు. రమణ వాటిని తీసుకెళ్ళి జెరాక్స్ కాపీలు తీసుకున్నాడు.

“మాస్టారూ! కథల సంపుటికి ముందుమాట ఎవరితో రాయించమంటారు?” అడిగాడు రమణ.

“అదెందుకూ? నా కథలన్నీ గొప్పవని ఎవరైనా సర్టిఫికెట్ ఇవ్వాలా? బాగుంటేనే కదా ఎడిటర్ తమ పత్రికలో ప్రచురించేది?” అన్నాడు కృష్ణమూర్తి.

“సరే మాస్టారూ? మీ ఇష్టం”

“అది నా అభిప్రాయం. ముందు మాటలు రాయించుకుంటున్నవాళ్ళని తప్పుబట్టడం లేదు”

“ఇక సెలవు మాస్టారూ! ఇది వుంచండి” అని ఒక కవరు చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు వెంకటరమణ.

అతను వెళ్ళిపోయిన కాసేపటికి శాంతమ్మ వచ్చి భర్త ముందు కూర్చుని “ఎవరండీ అతను? వట్టి పిచ్చోళ్ళా వున్నాడే?” అన్నది నవ్వుతూ.

"ఏం?"

"మీ కథల పుస్తకం ప్రింట్ చేస్తానంటుం టేను...!"

"అది పిచ్చికాదు. అభిరుచి అనాలి. అవన్నీ నీకేం అర్థమవుతాయిలే!" వెటకారంగా అన్నాడు కృష్ణ మూర్తి.

టీపాయ్ మీద కవరు చూసి "ఇదేమిటి? అతను మర్చిపోయాడా ఏం?" అన్నది.

"మర్చిపోలేదు. ఉంచండి అంటూ ఇచ్చాడు. బహుశా అగ్రిమెంట్ కాగితాలేమో?" అన్నాడు.

శాంతమ్మ కవరు విప్పి చూసింది. ఆశ్చర్యంతో ఆమె కళ్ళు పెద్దవయ్యాయి. అది సరికొత్త వెయ్యి రూపాయల నోట్లకట్ట. లక్ష రూపాయలు.

"ఏమండీ ఇంత డబ్బు?" సంభ్రమాశ్చర్యాలతో ఆమె గొంతు పెగలడం లేదు.


కృష్ణమూర్తి పరిస్థితి కూడా అదే. షాక్ కొట్టిన ట్లుండిపోయాడు. ఇంత డబ్బు అతను ఎందుకిచ్చి నట్లు? కథల సంపుటి మహా ఐతే ఐదొందలు ప్రింట్ చేస్తాడు. అవి ఓపెన్ మార్కెట్లో ఎవరూ కొనరు. ఏ రెండు మూడేళ్ళకో లైబ్రరీలకు అమ్ముకోవాలి. తనకు తెలిసినంతవరకూ అది యదార్థం. ఇందులో అతను లాభపడేది శూన్యం. పెట్టుబడి వస్తే అదే గొప్ప. మరి ఇంత డబ్బు ఎందుకి చ్చినట్లు?

కృష్ణమూర్తికి అయోమ యంగా వుంది. ఇందులో తనకు అర్థంకాని విషయం ఏదో వుంది అనుకున్నాడు.

"సాక్షాత్తూ ఆ వెంకటరమణే కొండ దిగొచ్చి మనల్ని ఆదుకున్న ట్లనిపిస్తోందండీ!" ఆనందంతో శాంతమ్మ కళ్ళల్లో నీళ్ళు తిరి గాయి.

☆ ☆ ☆

కృష్ణమూర్తి ఇల్లు ఖాళీ చేసి ఆనందాశ్రమంలో చేరిపోయాడు. అది ఏడెకరాలలో ఏర్పాటుచేసిన వృద్ధాశ్రమం. పళ్ళచెట్లు, పూల మొక్కలతో కళకళలాడుతూ పచ్చగా ప్రశాంతంగా వుంటుంది. వారానికొకసారి డాక్టర్స్ వచ్చి అందరి ఆరోగ్యం పరిశీలిస్తారు. మందులిస్తారు. అవసర మైతే హాస్పిటల్‌కి తీసు కెళ్ళడానికి అంబులెన్స్ రెడీగా వుంటుంది. కృష్ణమూర్తి దంపతులు ఉదయమే లేచి నడకతో పాటు యోగా చేస్తు న్నారు. ఇప్పుడు వారి ఆరోగ్యం చాలాబా గుంది. వయసు వెనక్కి మళ్ళినట్లుగా ఆనంది స్తున్నారు.




ఆర్నెల్లు గడిచాయి. అప్పుడప్పుడు కృష్ణమూర్తికి వెంకటరమణ గుర్తొస్తున్నాడు. తన కథల సంపుటి ఎప్పుడు ప్రింట్ చేస్తాడో? అనుకుంటూ వుంటాడు. కుతూహలంతో చింతామణి పబ్లికేషన్స్, ఏలూరు రోడ్డు, విజయవాడకు ఉత్తరం రాశాడు. కానీ జవాబు రాలేదు.



ఒకరోజు ఇంటి ఓనర్ నాగభూషణం ఆశ్రమా నికి వచ్చి ఒక లెటర్ ఇచ్చాడు. అది అమెరికా నుంచి వచ్చింది.

"మాస్టారూ!

నమస్కారం. ముందుగా మీరు నన్ను క్షమిం చాలి. నేను పబ్లిషర్‌ని కాను. మీ శిష్యుణ్ణి. ఇంటర్లో నాకు రెండు సంవత్సరాలు ఉచి తంగా పాఠాలు చెప్పారు. మీకు ఫీజు ఇచ్చుకోలేకపోయాను. అప్పటి నా ఆర్థిక పరిస్థితి మీకు తెలుసు. లేనివారికి సహృద యంతో ఉచితంగా చెప్పేవారు. అలా లబ్ధి పొందినవారిలో నేనొకడిని. నేను కేవలం మిమ్మల్ని చూడడానికి వచ్చాను. అప్పుడు మీరు ఇంటి ఓనర్‌తో మాట్లా డిన మాటలు విన్నాను. మీకు సహాయం చెయ్యాలనిపించింది. ఉచితంగా ఇస్తే తీసుకోరని సందేహించాను. మీరు కథలు రాయడం నాకు గుర్తొచ్చింది. పబ్లిషర్ అవతారం ఎత్తాను. అంతే. మరోలా భావించకండి. గురువుకి ఎంత చేసినా రుణం తీరదంటారు. నాకు కొంచెం ఆ అవకాశం వచ్చింది.

సెలవు.
మీ శిష్యుడు,
వెంకటరమణ."

☆

## హారర్ ట్రెండ్

ట్రెండ్ అనేది ఒకోసారి వేలంవెర్రిలాగే కనిపిస్తుంది కానీ అది కనకవర్షం కురిపిస్తున్నప్పుడు నిర్మాతలు కూడా అదే దారి తొక్కుతుంటారు. ఇప్పుడున్నది హారర్ చిత్రాల ట్రెండ్. మంత్ర, అనసూయ చిత్రాలు రిలీజై నిర్మాతలకి లాభాలు తెచ్చిపెట్టేసరికి చాలామంది దృష్టి ఇప్పుడు హారర్ చిత్రాలపై పడింది. మధ్యలో వచ్చిన రాంగోపాల్‌వర్మ సినిమా 'రక్ష' ఒకటి ఫ్లాప్ అయినాసరే ఆ బాట వదలలేదు. క్షుద్ర, ఇందుమతి, అరుంధతి సినిమాలు క్యూ కట్టి ఉన్నాయి. వీటిలో భారీ బడ్జెట్ సినిమా 'అరుంధతి' కోడి రామకృష్ణ దర్శకత్వంలో రూపొందుతోంది. ప్రస్తుతం ఇదొక్కటే అంచనాలకు నిలిచే చిత్రం. హిట్టా ఫట్టా అనేది వేచి చూడాల్సిందే!